

స్కిల్ కాలేజీలో శిక్షణకు ఎంపిక

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఐటి/టూరిజం అండ్ హాస్పిటాలిటీ/రంగంలోని వివిధ విభాగాల్లో జిల్లా స్కిల్ కాలేజీలో శిక్షణకు ఎంపికలు నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి యు.సాయికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు డీడీయూజీకేవై, సీడాప్, ఏపీఎస్ఎస్ డీసీ ఆధ్వర్యంలో నాలుగు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వసతి, భోజనంతో పాటు ఉచితంగా మెటీరియల్స్ అందజేస్తామన్నారు. తరగతులు పూర్తయ్యాక ఉపాధి కల్పిస్తామన్నారు. మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, సివిల్, ఆటోమోటివ్ అండ్ ఏరోస్పేస్‌లో బిటెక్ డిప్లొమా విభాగాల్లో 2020 నుండి 22లో ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 23 ఏళ్ల గల యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు సంబంధిత విద్యార్హత పత్రాలతో యూత్ ట్రైనింగ్ సెంటర్ సీతంపేట కేంద్రానికి రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7032060773ను సంప్రదించాలని సూచించారు.

మూలనపడ్డ ఎత్తిపోతల పథకం

- ఎండిపోతున్న వరినాట్లు
- మరమ్మతులకు నిధుల్లేవు : ఎపిఐడిసి ఎఇ



మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలం చుట్టూ నదులు ప్రవహిస్తున్నా ఈ ప్రాంత రైతాంగానికి సాగుకు చుక్క నీరందడంలేదు. దీంతో అనేక ఏళ్లుగా రైతులు సాగునీటి సౌకర్యం కోసం పాలకులకు పలుమార్లు విన్నపాలు విన్నవించుకోగా, ఎట్టకేలకు ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో రైతులకు సాగుకు ఎలాంటి అంతరాయం లేకుండా సాగింది. అంత వరకూ బాగానే ఉంది. అయితే ఈ ఎత్తిపోతల పథకం గత కొంత కాలంగా మరమ్మతులకు గురై పడకేసింది. ఇక రైతులకు కష్టాలు మొదలయ్యాయి. మరమ్మతులు చేయాలని అధికారులను కోరగా, తమ వద్ద నిధుల్లేవని చేతులెత్తాశారు. దీంతో రైతు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఇదీ మండలంలోని ఖరాసువలస పంచాయతీ దత్తివలస వద్ద గల బురాడమ్మ ఎత్తిపోతుల పథకం పరిస్థితి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని ఖరాసువలస ప్రాంత రైతులు ఎన్నో ఏళ్లుగా సకాలంలో వర్షాల్లేక సాగునీటికి చాలా ఇబ్బందులు పడుతుండే వారు. తమ పరిస్థితిపై స్థానిక నాయకులకు, ప్రభుత్వానికి అనేకమార్లు రైతులు మొరపెట్టుకున్నారు. వీరి ఇబ్బందులను చూసి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2010లో సుమారు రూ.2కోట్ల 73లక్షలతో స్వర్ణముఖి నదీ ఒడ్డున మండలంలోని ఖరాసువలస పంచాయతీ దత్తివలస వద్ద బురాడమ్మ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. దీని ద్వారా సుమారు 330 ఎకరాలు వరకు సాగునీరందుతుంది. దీంతో సుమారు 250 మంది సన్న, చిన్న కారు రైతులు ఖరీఫ్ సీజన్లో వరి పంటకు ఇబ్బందులు లేకుండా సాగింది.. ఎత్తిపోతల పథకం నది ఒడ్డున ఉండడంతో ప్రతి ఏటా వరదలు, తుఫాన్ల వల్ల మోటార్లు, ఎలక్ట్రికల్ బోర్డులు మరమ్మతులకు గురయ్యేవి. రైతులు నీటి పన్నులను ఎకరాకు రూ.500 చొప్పున వేసుకొని వాటి మరమ్మతులకు, అందులో పనిచేసే సిబ్బందికి జీతాలకు సరిపోయేవి. కానీ వరి పంటకు గిట్టుబాటు ధరలు లేక, పెట్టుబడులు పెద్ద మొత్తంలో ఉండడంతో పండించిన పంట పెట్టుబడులకే సరిపోతుండడంతో నీటి పన్నులు కూడా చెల్లించే పరిస్థితికి రైతులు వచ్చేశారు. దీంతో పథకం నిర్వహణా భారం అవ్వడం, ఇప్పుడు ఇది మరమ్మతులకు గురవ్వడంతో బాగు చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. దీంతో సాగునీటికి రైతులు నానా అవస్థలుపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పథకానికి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి : రైతులు

నిధుల్లేవు : అధికారులు

ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేపట్టాలని ఎత్తి పోతల పథకం కన్వీనర్ బూస తవుడు, రైతులు రామారావు, శ్రీను, అప్పల నాయుడు, సింహాచలం, మాధవ, తవుడు ఎపిఐడిసి ఎఇ శ్రీనివాసరావును కోరారు. పథకాన్ని ప్రారంభించి పదేళ్లు పూర్తికావడంతో పుంపులు, ఎలక్ట్రికల్, పైపులు, రిటర్నింగ్ వాల్సు మొదలైనవి మరమ్మతులకు గురయ్యాయన్నారు. వీటి అన్నింటినీ పరిశీలించి ఎంత మొత్తంలో నిధులు అవసర



సాగునీరు లేక ఎండిపోతున్న వరి నాట్లు

ముందని, అంచనా వేసి అందులో రైతులు 25 శాతం వరకు నిధులు అందజేస్తే మిగతాది ప్రభుత్వం మంజూరు చేస్తుందని, దీని కోసంపై అధికారులకు నివేదిక పంపి మరమ్మతులు చేపడతామని ఎఇ తెలిపారు. అనంతరం ఎత్తి పోతల పథకం కన్వీనర్ బూస తవుడు మాట్లాడుతూ దీన్ని ప్రారంభించినప్పటి నుంచి కన్వీనర్‌గా తాను పనిచేస్తున్నానని, ఐదేళ్ల వరకు ఎటువంటి మరమ్మతులు రాలేదని, కానీ ప్రతి ఏటా వరదల వల్ల మోటార్లు, ఎలక్ట్రికల్ బోర్డులు రిపేర్ అవుతున్నాయని, ఇప్పుడు పూర్తిగా పంపులు రిపేర్లు కావడంతో రైతులు అంత పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయించాలని కోరారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి కలెక్టరేట్

భవనిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధ రించాలని, గతంలో రూపొందించిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దావాల రమణారావు, వై.మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె గౌరీశ్వరరావు, ఆర్.రాము, మాట్లాడుతూ, గత ఎన్నికల సమయంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా భవనిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను రద్దు చేయడం దుర్మార్గమని విమర్శించారు. రూ.2450 కోట్లు భవనిర్మాణ కార్మికుల సెస్ నుండి సేరించిన నిధులను వారి సంక్షేమానికి ఖర్చు చేయకుండా ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకొని కార్మికులను మోసగించిందని విమర్శించారు. ఇసుక అందుబాటులో లేకుండా చేసి భవనిర్మాణ కార్మికులకు పనుల్లేకుండా చేశారన్నారు. భవన నిర్మాణ కార్మికుల పట్ల వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, ఈ నిర్లక్ష్యాన్ని విడనాడాలని నాయకులు కోరారు. ఇసుక, సిమెంటు, ఐరన్ ధరలు పెరుగుదల ప్రభావం కార్మికులకు పనులు లభ్యతపై పడిందని, ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను, ప్రజలను ఆదుకునేలా ఇసుక, సిమెంటు, ఐరన్ ధరలు తగ్గించాలని కోరారు. కరోనా కాలంలో మరణించిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని, 60 ఏళు దాటిన భవన నిర్మాణ కార్మికులకు రూ.6వేలు చొప్పున ప్రతి నెలా పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఇప్పటికే అనేక దఫాలుగా ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ బోర్డును పునరుద్దరిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అత్తముడి లక్ష్మణరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గార చిన్నారావు, వీరనాయుడు, కె.సూర్యనారాయణ, ఎం.సోమేశ్వరరావు, ఆర్ శ్రీను, ఎం.రవి, ఎం.గణపతి, పెద్దఎత్తున భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

పని సర్దుబాటును రద్దుచేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జూన్‌లో ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించి, ఇప్పుడు పని సర్దుబాట పేరుతో ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు అన్నారు. బదిలీలు జరిగిన ఉపాధ్యాయులకు 3 నెలలుగా జీతాలు చెల్లించకుండా తాత్సారం చేస్తున్న విద్యశాఖాధికారులు పని సర్దుబాటును రెండు రోజుల్లో పూర్తి చేయడమంటే ఉపాధ్యాయులను వేధించడమేనిని అన్నారు. జూన్‌లో బదిలీ జరిగి స్థిర నివాసం ఏర్పర్చుకున్న ఉపాధ్యాయులను మళ్లీ స్థానచలనం చేయడం దుర్మార్గమన్నారు. పాఠశాల విద్యా శాఖ పేరును ఉపాధ్యాయులను వేధించే శాఖగా మార్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులను వేధిస్తే దాని ప్రభావం బోధనపై ఉంటుందని, చివరకు విద్యార్థులే నష్టపోతున్నారని అన్నారు. కావున ఇటువంటి అనాలోచిత నిర్ణయాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పులులు, ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలి

అటవీశాఖాధికారికి సిపిఎం వినతి

ప్రజాశక్తి - బెలగాం

జిల్లాలో పులులు, ఏనుగులు సంచరిస్తున్నాయని, వాటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని సిపిఎం నాయకులు జిల్లా అటవీశాఖాధికారులకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ జిల్లాలో సీతంపేట, భామిని మండలాలతో పాటు ఆ చుట్టుప్రక్కల పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారని, ఈరోజు హిరమండలం ప్రాంతంలోని తోటల్లో సంచరిస్తున్నట్లు వీడియోలో తెలుస్తుందని పేర్కొన్నారు. సాలూరు, గరుగుబిల్లి మండలాల్లో కూడా సంచరించే ఆనవాళ్ళు కనిపిస్తున్నట్లు ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మైనింగ్ పేరుతో ఒడిశాలో క్వారీ శబ్దాలతో ఏనుగులు, పెద్దపులులు మైదాన ప్రాంతంలో నిర్మానుష్యంగా ఉందని ఇక్కడ తోటల్లో, చెట్లు ఉన్న ప్రాంతాలకు చేరుతున్నాయన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వాల వైఫల్యమేనని, గిరిజన వ్యతిరేక చట్టాలు మైనింగ్ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా చేసే చట్టాలు వెంటనే రద్దు చేయాలని, పెద్దపుల్ని, ఏనుగుల్ని అడవికి పంపించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అటవీశాఖ కార్యాలయ ఎఓ చంద్రశేఖర్‌కు వినతిని అందజేశారు. వినతిని అందజేసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు, వై.మన్మధరావు ఉన్నారు.



డిఎఫ్ఒ కార్యాలయ అధికారికి వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

గ్రూప్-1లో కొలువుదీరారు



ఉదయ పావని (డిఎస్‌పి)



ఆర్‌టిఒగా ఎంపికైన మనోహర్

ప్రజాశక్తి-నెల్లిమర్ల/సాలూరు

ఎపిపిఎస్ గురువారం విడుదల చేసినగ్రూప్-1 పరీక్షల్లో ఉమ్మడి జిల్లాలకు చెందిన వాసులు ప్రతిభ కనబర్చారారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం అలుగోలుకు చెందిన కెల్ల ఉదయపావని డిఎస్‌పి పోస్టు సాధించింది. కాకినాడ జెఎన్‌టియులో బిటెక్ పూర్తిచేసింది. ఉదయ పావని తండ్రి నారాయణ అప్పలనాయుడు (బుల్లయ్య) డీలర్‌గా సేవలు అందిస్తున్నారు. తల్లి భారతి అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. అలాగే రామభద్రపురం మండలం బూశాయవలసకు చెందిన మడక కృష్ణమూర్తి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. గుర్ల మండలం నాగళ్లవలసకు చెందిన ఎవిఆర్ మూర్తి జిల్లా స్టాప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారిగా ఎంపికయ్యారు. ఈయన ప్రస్తుతం అమరావతిలోని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఎఒగా పనిచేస్తున్నారు. **సాలూరు** పట్టణానికి చెందిన ఓ వ్యాపారి కుమారుడు గోపిశెట్టి మనోహర్ ఎపి సర్వీస్ కమిషన్ గ్రూపు -1 పరీక్ష ల్లో ఆర్టీఓ గా ఎంపికయ్యారు.పాచిపెంట మండలం మైసూరుకు చెందిన గోపిశెట్టి నాగేశ్వరరావు పట్టణంలో మెయిన్ రోడ్ లో లక్ష్మీ ఎలక్ట్రికల్ షాపు నడుపుతున్నారు. ఆయన కుమారుడైన మనోహర్ ఢిల్లీలోని యూనివర్శిటీ బిఎ ఆనర్స్ చదువుతూ గ్రూపు-1పరీక్ష ల్లో ఆర్టీఓ గా ఎంపికయ్యారు. దీంతో పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు హర్షం వ్యక్తంచేశారు.



బిఎల్ఓలకు సూచనలు ఇస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

పారదర్శకంగా ఓటరు సర్వే : పిఒ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

ఇంటింటికీ వెళ్లి చేపడుతున్న ఓటరు సర్వేను పారదర్శకంగా చేపట్టాలని పాలకొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. మండలంలోని బెజ్జిలో జరుగుతున్న ఓటరు సర్వేను గురువారం ఆమె పరిశీలించారు. 202 పోలింగ్ బూత్‌లో ఓటర్ సర్వేను పరిశీలించి ఓట్లను తొలగించేటప్పుడు నిబంధనల ప్రకారం చేయాలని బిఎల్ఒలకు సూచించారు. కొత్తగా ఓట్లను నమోదు చేయడం, ఫొటోలు సరిగ్గా లేని ఓటర్ల వారీగా మళ్లీ ఫొటోలు తీసుకొని వాటిని సరిచేయాలని అన్నారు. అనంతరం బెజ్జి, తుమరాడలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనాలను పరిశీలించారు. సెప్టెంబర్ 15 నాటికి భవన నిర్మాణాలను పూర్తి చేసి అప్పగించాలని ఆదేశించారు. అలాగే టిడి పారాపురంలో 203 పోలింగ్ బూత్ ఓటర్ సర్వేను పరిశీలించారు. రాజకీయ పార్టీలు చెప్పిన సమస్యలను పరిష్కరించి ఓటర్ సర్వేను వేగవంతం చేస్తామని అన్నారు. అనంతరం తంపటాపల్లిలో హౌసింగ్ లే అవుట్ ను పరిశీలించారు. లే అవుట్‌లో మంజూరైన అన్ని గృహాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఎఇకి సూచించారు. అలాగే తహశీల్దార్, ఎంపిడిఒలు లే అవుట్‌ను సందర్శించి తాత్కాలిక రోడ్డు సదుపాయం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు. అలాగే గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయం భవనాన్ని పరిశీలించి సెప్టెంబర్ 15 నాటికి అప్పగించాలన్నారు. కార్యక్రమంలో పాలకొండ హౌసింగ్ ఎఇ బి.మాధవరావు, ఎన్నికల డిటి, ఇతర ఎన్నికల, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పట్ల విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం

వినియోగదారుల రక్షణ చట్టం, 2019 పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, అందుకు గాను వారికి ఈ చట్టం గురించి తెలియజేయాలని జాయింటు కలెక్టరు ఆర్. గోవిందరావు తెలిపారు. గురువారం స్థానిక ఐటిడిఎ సామాజిక భవనంలో వినియోగదారు క్లబ్ ఇన్‌ఛార్జులుగా నియమితులైన ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్లకు జిల్లా స్థాయి ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జాయింటు కలెక్టరు మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం, 2019 పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో 8,9 తరగతి విద్యార్థుల కోసం ఒక వినియోగదారు క్లబ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల హక్కులను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లేందుకు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖ విస్తతమైన ప్రచారాన్ని ప్రారంభిస్తోందన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

విద్యార్థి సంఘం భాగస్వామ్యం లేకుండా, వినియోగదారుల హక్కులను సమాజానికి తెలియజేయలేమని అందుకుగాను విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేసేందుకు వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించుటకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో 8, 9వ తరగతి విద్యార్థుల కోసం ఒక వినియోగదారు క్లబ్‌ను ప్రారంభించి అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళికను అందజే యడమైందన్నారు. వినియోగదారులకు సంబంధించిన విషయాలపై సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు, వినియోగదారుల సవాళ్లపై సర్వే నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డిఇఒ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ 9,9 తరగతి విద్యార్థుల కోసం ఒక వినియోగదారుల క్లబ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల క్లబ్‌లకు ఇన్‌ఛార్జులుగా నియమించిన 189 మంది ఉపాధ్యాయులకు ఈ చట్టం పట్ల అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడమైనదన్నారు.

పులి సంచారం పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - సీతంపేట

జిల్లాలో ఒకవైపున ఏనుగులు అతలాకుతలం చేస్తుంటే మరోపక్క పులులతో గిరిజనులు బేంబోలెత్తిపోతున్నారు. గత రెండు రోజులుగా మన్యంలో పులి అడుగులు కనిపించడంతో గిరిజనులు పొలాలకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. గురువారం తాజాగా చిన్నబగ్గ రిజర్వాయర్ ఫారెస్ట్ కొండపై ఉన్న నరసింహస్వామి గుడి పక్కన పులి పాదాలు కనిపించడంతో అక్కడున్న తొమ్మిది గ్రామాల ప్రజలను అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తం చేశారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని కృష్ణపల్లి లో గృహ నిర్మాణాలను ఆర్‌డిఒ కె.హేమలత గురువారం పరిశీలించారు. జిల్లా స్థాయి గృహ ప్రవేశాల కార్యక్రమం కృష్ణపల్లిలో ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించిన సంగతి విదితమే. గృహ ప్రవేశాల కార్యక్రమం నాటికి ఎక్కువ సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో అన్ని శాఖల అధికారులు సంబంధిత చర్యలు చేపట్టారు. పనులు వేగవంతం చేయాలని ఆర్‌డిఒ ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఖరీఫ్ పంట ఇ క్రాప్ బుకింగు పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లు, జాయింటు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, 4జి టవర్లకు భూకేటాయింపు, గోడౌన్లనిర్మాణం, తృణధాన్యాల సేకరణ, మద్దతు ధర కల్పన, జగనన్న పాలవెల్లువ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ సెప్టెంబరు 15 నాటికి ఖరీఫ్ పంట ఇ-క్రాప్ బుకింగు పూర్తిచేయాలని, తుదిజాబితా సెప్టెంబరు 30 నాటికి రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించాలని తెలిపారు. రీ సర్వే సకాలంలో పూర్తిచేయాల న్నారు. సమీక్షా సమావేశంలో పాల్గొన్న జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు మాట్లాడుతూ రేసర్వే పనులు చురుగ్గా జరుగుతున్నాయని, ఫైనల్ ఆర్ఒఆర్ పనులు ఈ నెలాఖరుకు పూర్తిచేస్తామని, స్టోన్ ప్లాంటేషను పనులు మూడు రోజుల్లో పూర్తిచేస్తామని తెలిపారు. 4జి సెల్ టవర్లకు భూములు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజీ, సిపిఒ పి.వీర్రాజు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



పట్టణంలో మానవహారం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - సాలూరు

సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు గురువారం పట్టణంలో జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు ఆధ్వర్యాన కార్మికులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికుల ను రెగ్యులర్ చేస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చారని చెప్పారు.ఆ హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో చాలీచాలని జీతాలతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో వున్నారని చెప్పారు. వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు శ్రీను, సింహాద్రి పాల్గొన్నారు.





గుమ్మలలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, టిడిపి తరపున ప్రచారం చేస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

జోరుగా ఉప ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మ గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికను వైసిపి, టిడిపి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇరు పార్టీలు బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి బలపరిచిన అభ్యర్థి ఆరిక గోపాల్ తరపున ఎమ్మెల్యే పాములు పుష్ప శ్రీవాణి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఆమెతో పాటు ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, జిల్లా కోప్సన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి జిల్లా అధికారి ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, మండల కన్వీనర్ ఐ. గౌరీ శంకర్, మైనార్టీ విభాగం నాయకులు షేక్ నూరేళ్ల, వైసిపి నాయకులు పాల్గొన్నారు. టిడిపి బలపర్చిన అభ్యర్థి కొండగొర్రి వెంకటరావు తరుపున టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు వెంపటాపు భారతి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఇండిపెండెంట్‌గా బరిలో ఉన్న ఇద్దరు అభ్యర్థులు నిమ్మక భాను ప్రసాద్ (చంటి), తోట పటయ్య తన అనుచర వర్గంతో ప్రచారం నిర్వహించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

అజ్జాడ గ్రామాభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలంలోని అజ్జాడ గ్రామ అభివృద్ధికి సహకరించ వాలని గురువారం ఆ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, పెద్దలు ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తాను అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ గ్రామాభివృద్ధికి సిద్ధంగా ఉన్నానని, అయితే మీరందరూ కలిసి ఉమ్మడిగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడమే తరువాయని గ్రామ అవసరాలను గుర్తించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి గ్రామ ప్రజా ప్రతినిధులూ మీ వంతుగా మీరు కృషి చేయాలని అందుకు అవసరమైన నిధులు మీకు తప్పక సర్దుబాటు చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అక్కినేని జగన్, వైస్ సర్పంచ్ లక్ష్మణరావు, ఎంపిటిసి గణేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- పాలకొండ

పాలకొండ విద్యుత్ ఉపకేంద్రం నిర్వహణ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని విద్యుత్ శాఖ ఇఇ టిజెకె మూర్తి, విద్యుత్ శాఖ ఎఇఇ శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పాలకొండ పట్టణం, తంపటపల్లి, మంగళాపురం, గోపాలపురం, బాసూరు, బుక్కూరు, కొండాపురం, అంపిలి, వెలగాడ, లంబూరు ప్రదేశాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

పేద విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పేద విద్యార్థులకు ఆ కళాశాల పూర్వ విద్యార్థి రెడ్డి నాగభూషణరావు యూనిఫామ్ దుస్తులు, పుస్తకాలు అందజేశారు. గురువారం కళాశాల ప్రిన్సిపల్ జె రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాలకు చెందిన 15 మంది పేద విద్యార్థినులకు దుస్తులు, 60 మందికి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట భైరిపురం మాజీ సర్పంచ్ రాజు, ఎం వెంకట్రావు రిటైర్డ్ ప్రిన్సిపల్ రెడ్డిమురళీ, అధ్యాపకులు తాతారావు, రవికుమార్, శర్మ, సత్యనారాయణ, లక్ష్మణరావు, శివ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో టిడిపి భవిష్యత్తు గ్యారంటీ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని ములగ, కవిటిభద్ర పంచాయితీలలో గురువారం టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బోనెల విజయచంద్ర టిడిపి శ్రేణులతో కలిసి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయబోయే కార్యక్రమాల గురించి ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా సదరు గ్రామాలకు చెందిన బొంగు త్రినాథ్, మూడడ్డ ఉమ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, నాయకులు బోను చంద్రమౌళి, చింతల అమరావు రామకృష్ణ, బంకపల్లి అశోక్ కుమార్, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బీటలు వారుతున్న వరి పొలాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఎగువ ప్రాంత భూములకు సకాలంలో వర్షాలు పడకపోవడంతో సాగునీరు లేక పంట భూములు బీటలు వారుతున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినప్పటికీ వర్షాలు పడకపోవడంతో అన్నదాత ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. గతేడాది కూడా సకాలంలో వర్షాలు కురవక పంటపై పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల్లో కూరుకు పోయామని ఈ ఏడాదైనా పంటలు బాగా పండితే కొంతమేరైనా అప్పులు తీరతాయని ఆశతో పంటలు సాగు చేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొట్టుగుమ్మడలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కొట్టుగుమ్మడ గ్రామంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి ఉమామహేశ్వర వివిధ రకాల రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నయోమి, ఎంఎల్‌హెచ్‌పి ఆశ, ఎఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఓటర్ల సర్వే వేగవంతం చేయాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా ఏ మేరకు జరిగిందని అడిగి తెలుసుకున్నారు. ఓటర్ జాబితాలో తప్పులు, మరణించిన వారి పేర్లు తొలగించడం, పోలింగ్ బూత్‌లు సరి చేయడం వంటివి నిబంధనలు ప్రకారం చేయాలన్నారు.

జవాన్ కుటుంబానికి సాయం అందజేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినభోగిలికి చెందిన బిఎస్ఎఫ్ జవాన్ నగర ప్రసాద్ మృతి చెందడంతో గుజరాత్ సరిహద్దు ప్రాంతంలో గాంధీనగర్‌లోని 74వ బెటాలియన్ కమాండెంట్ సంజయ్ అవినాష్, డిప్యూటీ కమాండెంట్ సంజయ్ కుమార్, వర్మ అందించిన ఆర్థిక సాయం రూ.1,08,000ను ప్రసాద్ భార్య పవిత్రకు హెడ్ రెడ్డి శ్రీనివాసరావు చేతుల మీదుగా గురువారం అందించారు. తెలుగు రాష్ట్రంలోని బి ఎస్ ఎఫ్ జవాన్ల అసోసియేషన్ తరుపున ప్రసాద్ భార్య పవిత్రకు రూ.6 వేలు, తల్లి గంగమ్మకు రూ.18 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీకి దస్త్రాలు సిద్ధం చేయాలి

బలిజిపేట: ఉపాధి చట్టం కింద 2022-2023 ఆర్థిక సంవత్సరం సంబంధించిన అన్ని రకాల దస్త్రాలు సిద్ధం చేసి సామాజిక తనిఖీ బృందానికి అప్పజెప్పాలని ఎంపిడిఒ. విజయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆమె ఉపాధి హామీ చట్టం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెలాఖరు వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధి పనికి సంబంధించిన అన్ని రకాల రికార్డులు క్షేత్రస్థాయిలో సిబ్బంది సిద్ధం చేసుకోవాలని వాటిని తనిఖీ బృందానికి చూపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అన్ని గ్రామ పంచాయతీల క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు, సామాజిక తనిఖీ బృందం, ఎపిఒ కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

నియోజకవర్గ పరిధిలో గల అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ గురువారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జ్యోతిలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జోగారావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి అందించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ తప్పకుండా తాను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారమయ్యే అంశాలపై స్పష్టమైన హామీ ఇచ్చేలా అవసరమైతే కొన్ని అంశాలపై వచ్చే మేనిఫెస్టోలో చేర్పించేందుకు సైతం సిఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా సచివాలయం

వీరఘట్టం: మండలంలోని వండువ గ్రామ సచివాలయం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఉపాధి హామీ పథకం సుమారు రూ.40 లక్షల అంచనా వ్యయం నిర్మాణ పనులు చేపట్టారు. దాదాపుగా సచివాలయ భవన నిర్మాణ పనులు అన్ని హంగులతో పూర్తిచేసి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. భవన సదుపాయం లేకపోవడంతో ప్రస్తుతం ఇరికైనా భవనంలో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

మురుగునీట్లో తాగునీటి కుళాయి

●మురికికూపంలోనే స్థానికుల సహవాసం ●ఇదీ పట్టణ ప్రజల దుస్థితి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఊరుగొప్ప... పేరుదిబ్బ ఉన్న చందంగా ఉంది జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణం పరిస్థితి. జిల్లా కేంద్రంలోని ప్రజలే అనేక సమస్యల మధ్య జీవనం సాగిస్తుంటే ఇక పల్లెల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో పట్టణంలోని 9వ వార్డు పరిధిలో గల విజయరామరాజు కాలనీలో పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది. ఈ కాలనీ ఉన్న మొదటి వీధిలో నివాస గృహాల ప్రాంతం కాలువలో ఉన్న మురుగునీరు గత నాలుగు రోజులుగా రహదారిపైకి చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో కుళాయిల ద్వారా తాగునీరు పట్టుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోతుందని, గత్యంతరం లేక మురుగునీరు మధ్యలో దుర్వాసనను భరిస్తూ తాగునీరు పట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత వార్డు సచివాలయ శానిటరీ సెక్రెటరీ గానీ, ప్రజారోగ్య విభాగం అధికారులుగానీ, సిబ్బంది గానీ పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే మురుగునీరు మరికొన్ని రోజులు రహదారిపై నిల్వ ఉంటే రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవ్వడం ఖాయమని ఆ వీధి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.




మురుగు నీటిలో తాగునీటిని పడుతున్న మహిళ

ప్రకృతి వ్యవసాయంతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రైతులకు ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సంపాదించవచ్చని జిల్లా డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన స్థానిక వైటిసిలో ఏర్పాటు చేసిన మండల వ్యవసాయ శాఖ సహాయకులకు, ఐసిఆర్‌పిలకు శిక్షణలో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతులు, ప్రకృతి వ్యవసాయంలో పాటించే రాజీలేని సూత్రాలు, అదనపు ఆదాయం వచ్చే పంటల నమూనాలు, వాటిని రైతులకు చేరువ చేసేలా మహిళా సంఘాలు, గ్రామ ప్రకృతి వ్యవసాయ సిబంది పాత్రపై శిక్షణ ఏర్పాటు చేయడం ఎంతో ముదావహమని అన్నారు. ఎంపిపి దీనమయ్య మాట్లాడుతూ, రసాయనాలు, పురుగు మందుల్లేని అన్ని పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యం సాధ్యమవుతు ందన్నారు. జట్టు సంస్థ ట్రస్ట్ డి.పారినాయుడు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అందరి సహకారంతో సాధ్యమని, దీనికి కావాల్సిన సమావేశాలు ఏర్పాటు చేయడంలో ముందు ఉండడం అందరి బాధ్యత అని అన్నారు. భూమి లేని రైతులు వారికీ కావాల్సిన కూరగాయలు, వారి పెరటితోటలో లేదా మిద్దె తోటలో పండించుకొనేలా ముందుకు రావాలని కోరారు



మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మారుమూల గిరిజన గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. మండలంలోని మారుమూల కొండ శిఖర గ్రామమైన జర్న పంచాయతీ బొద్దిడి బిటి రహదారి నుంచి చినవంకధార గ్రామం వరకు రూ.90లక్షలతో మంజూరైన రహదారికి గురువారం శంకుస్థాపన చేశారు. ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడం ద్వారా తాగునీరు, వైద్యం వంటివి మెరుగు పరచడానికి వీలుంటుందన్నారు. 1400 మీటర్లు నూతన రహదారి నిర్మాణం జరిగితే రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.ధీనమయ్య , జెడ్‌పిటిసి రాధిక, వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ఏజెన్సీలో కవులుండడం అదృష్టం

గుమ్మలక్ష్మీపురం: మారుమూల ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో మంచి ప్రతిభ కలిగిన కవులు మాకు దొరకడం అదృష్టమని సర్పంచి బొత్తాడ గౌరీశంకరరావు కొనియాడారు. మండలంలోని మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న పాలక దేవానంద్ రచించిన చెల్లి రావే బంగారు తల్లి రావే అనే గీతం బాల గేయ సారసత్వం పుస్తకంలో ప్రచురితమైంది. దీన్ని హైదరాబాదుకు చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి కవి, రచయిత, విశ్లేషకులు డాక్టర్ వైరాగ్యం సంపాదకులు ప్రచురించిన పుస్తకంలో 84వ పేజీలో పాటను ప్రచురించారు. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా పాట ఉండడం గర్వకారణమని పేర్కొన్నారు. గుమ్మలక్ష్మీపురంలో గురువారం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి ప్రతిభగల కవులు తన రచనా శైలితో పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం మన గ్రామ అదృష్టమని అన్నారు. ఇటువంటి వారిని ప్రభుత్వం ప్రోత్సహించి సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుర్తిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తితో పాటు ఖాళీగా ఉన్న సమయంలో రచనలు చేయడం గర్వకారణమన్నారు. దేవానంద్ మాస్టర్ రచించిన పాటను చూసి ఎంపిపి దీనమయ్య, జడ్పిటిసి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి గిరి బాబు అభినందించారు.

యాప్ ఉపయోగించాలి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

స్వయం సహాయక సంఘాలు లోకోసు యాప్ ఉపయోగించాలని ఎపిఎం సింహాచలం అన్నారు. గ్రామాలలో ఉండే ప్రతి స్వయం సహాయక సంఘాలు వారి సంఘం తరుపున లోకోసు యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. మండలంలోని కుర్మరాజు పేటలో గ్రామైక సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంఘం తరుపున ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవడం వల్ల సంఘం తాలూకా ప్రతి నగదు లావాదేవీలు, ప్రభుత్వం నుంచే వచ్చే లబ్ధిని నేరుగా తెలుసుకోవచ్చని తెలిపారు. సభ్యులకు అవసరమైన స్త్రీనిధి ద్వారా డబ్బును వాడుకోవచ్చని బయట వడ్డీ వ్యాపారుల బెడద ఉండదని నెలనెలా సక్రమంగా చెల్లించిన వారికి తక్కువ వడ్డీకే రుణం పొందవచ్చని తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - కొమరాడ

వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన పెదఖేర్జిలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాల నమోదు, రికార్డులను పరిశీలించారు. గతంలో నిర్వహించిన హీమోగ్లోబిన్, రక్త పరీక్షలు ఫలితాలను పరిశీలించి రక్తహీనతగా గుర్తించిన విద్యార్థులకు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేశారు. ప్రస్తుతం ఏ మేరకు హీమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందినదనే విషయమై వైద్య సిబ్బందిచే వారికి పరీక్షలు చేయించారు. రక్తహీనత ఉన్న విద్యార్థులకు వైద్య సిబ్బంది, వసతి గృహ సిబ్బంది ఎటువంటి చర్యలు చేపడుతున్నారని ఆరా తీశారు. ప్రతి రోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించాలని, పౌష్టికాహారం అందించాలని సూచించారు. అలాగే హీమోగ్లోబిన్ శాతం సాధారణంగా ఉన్న విద్యార్థులకు వారానికి ఒకసారి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించాలన్నారు. అనంతరం ఆయన సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థుల ఆరోగ్య పరిశీలన చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి అనారోగ్య సమస్యలను అడిగి ప్రస్తుతం ఏ మేరకు కోలుకున్నారో పరిశీలించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆల్బెండజోల్ మాత్రలు విద్యార్థులందరికీ వేయించినదీ తెలుసుకున్నారు. అలాగే పలువురు విద్యార్థుల ఆరోగ్య పరిశీలన చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహన్‌రావు

దోమల నివారణ చర్యలు

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వాటికి కారణమైన దోమల వ్యాప్తిని నివారించే దిశగా చర్యలు తప్పనిసరి అని డిఐఒ జగన్మోహనరావు అన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎం పురం గ్రామ చెరువులో గంబూషియా చేపలను వైద్య సిబ్బంది విడిచి పెట్టే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇవి దోమల లార్వాలను తిని వేస్తాయని తద్వారా మలేరియా, డెంగీ జ్వరాలకు కారణమైన దోమల నివారణకు సాధ్యమవుతుందన్నారు. అదేవిధంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.అరుణ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది సీతారాం, రాజారావు, సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది మంగమ్మ, అనిల్,రమేష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణకు 'గంబూషియా'

ప్రజాశక్తి- సాలూరు

పట్టణంలోని వడ్డాది వారి కోనేరు, డబ్బివీధి పేరసాగరం చెరువుల్లో గంబూషియా చేప పిల్లలను ఇంఛార్జి మున్సిపల్ కమిషనర్ రాఘవాచార్యులు, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఈశ్వరరావు గురువారం విడుదల చేశారు. దోమల నివారణ కోసం ఈ చెరువుల్లో గంబూచియా చేప పిల్లలను విడిచి పెడుతున్నామన్నారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా దోమల నివారణకు గంబూచియా చేపల పిల్లలను విడిచి పెట్టినట్లు ఇంఛార్జి కమిషనర్ రాఘవాచార్యులు చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజు పాల్గొన్నారు.

కురుపాం : మలేరియా నివారణలో భాగంగా కురుపాం గ్రామ సమీపంలో ఉన్న చెరువుల్లో గంబుషియా చేపలను కురుపాం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్. నారాయణరావు ఆధ్వర్యంలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల్లో, నీటి గుంటలో దోమల ఉత్పత్తి పెరగకుండా దోమలు పెట్టే గుడ్లను, లార్వాలను గంబుషియా చేపలు ఆహారంగా తినడం వల్ల దోమల ఉత్పత్తి తగ్గుతుందని దీని వల్ల మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చునని కురుపాం సబ్ యూనిట్ పరిధిలో ఉన్న ఐదు పిహెచ్‌సిలు సంబంధించిన చెరువుల్లో, నీటి గుంటలో ఈ చేపలను విడుదల చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.టి.ఎస్ పి. ఆదినారాయణ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కురుపాం: చెరువులో గంబూషియా చేపలను వదులుతున్న సిబ్బంది

లింగాకర్షణ బుట్టలతో పురుగుల నియంత్రణ

ప్రజాశక్తి- పాచిపెంట

పత్తి పంటలో వచ్చే కాయతొలుచు, ఆకు తినే పురుగులను లింగాకర్షక బుట్టలను ఉపయోగించి నియంత్రించవచ్చని, ఎకరానికి 7 నుండి 10 లింగాకర్షణ బుట్టలను పెట్టుకుంటే పురుగుల ఉధృతిని తెలుసుకోవడమే కాకుండా నియంత్రించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని అమ్మవలసలో వివిఎ మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడిలో మాట్లాడారు. నిరంతర పంటల విశ్లేషణ ద్వారా పంటల్లో ఉండే పురుగులు తెగుళ్లను గుర్తించడమే కాకుండా మిత్ర పురుగులను సైతం గుర్తించి వాటికి హాని జరగకుండా సమిష్టి నిర్ణయాన్ని తీసుకునేందుకు పొలంబడి ఉపయోగ పడుతుందని తెలిపారు. ఖర్చును తగ్గించి దిగుబడిని పెంచి పర్యావరణానికి హాని జరగకుండా నిరంతర విశ్లేషణ ద్వారా ఆరోగ్యవంతమైన పంటను పండించడంలో రైతునే సన్నద్ధం చేయడమే పొలంబడి లక్ష్యమని తెలిపారు. అనంతరం రైతులను సమూహాలుగా చేసి పంటలో గుర్తించిన చీడపీడలను, ఇతర వాతావరణ వివరాలు చార్ట్ పై బొమ్మలు గీసి చూపించారు. దీనిలో సీతాకోకచిలుక గ్రూపు మొదటి బహుమతి గెలుచుకోగా, కందిరీగ గ్రూపు రెండవ బహుమతి గెలుచుకుంది. కార్యక్రమంలో గ్రామ పెద్ద రేయి అప్పారావు ప్రకృతి సేద్యం ప్రతినిధులు యశోదమ్మ, బాలకృష్ణ, తిరుపతినాయుడు, ఐసిఆర్‌పిలు విజయ్, సురేష్ పాల్గొన్నారు.



పాచిపెంట: పొలంబడిలో పంటలను పరిశీలిస్తున్న ఎఒ

వెంకటాపురంలో పొలంబడి

సీతానగరం: మండలంలోని కె.వెంకటపురంలో పొలంబడి కార్యక్రమం గురువారం ఎఒ అవినాశ్ ఆధ్వర్యంలో జరిగింది. యాంత్రీకరణ విధానంలో వరి నాట్లు వేయడం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని తెలిపారు. ఈ పద్ధతిలో వరి నారును ముందుగా ట్రేల్లో పెంచుకొని 15-20 రోజుల నారును యంత్రశీలతో ఉండడం జరుగుతుందన్నారు. దీనికి ఎకరాకు 12 కేజీల విత్తనం సరిపోతుందన్నారు. దీని వల్ల రైతుకు ఉడుపు ఖర్చు సాధారణ పద్ధతి కంటే ఎకరాకు రూ.1800 వరకు ఆదా అవుతుందన్నారు.

ఈ పద్ధతి వల్ల వరిలో కలుపుతీత, ఎరువులు వేయడం సులభతరమవుతుందన్నారు. పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి అధిక దిగుబడికి దోహదపడుతుందన్నారు. అలాగే పాస్ఫో బాక్టీరియల్ ఇనాక్యులెంట్ అయిన ద్రవరూప జీవన ఎరువు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కల్చరును సేంద్రియ ఎరువుతో కలిపి విత్తనం నాటే సమయంలో నాటిన వారం రోజుల్లోపు పొలంలో చల్లాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారితో పాటు పొలంబడి రైతులు, గ్రామపెద్దలు, ఇతర రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న వెంకటరావు

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేద విద్యార్థులకు రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎస్.వెంకటరావు, ఇంజినీరింగ్ డిఇ రెడ్డి మురళి ఆధ్వర్యంలో యూనిఫాం, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు సహకారం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈనాటి విద్యార్థులే రేపటి పౌరులన్నారు. అనంతరం 50మంది విద్యార్థులకు యూనిఫాం, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిఎస్‌వి త్రినాధరావు, వెంకట భైరిపురం మాజీ సర్పంచ్ డి.పరమహంస, అధ్యాపకులు టి.రవికుమార్, ప్రదీప్ కుమార్, వినోద్, ప్రసాదరావు, రమేష్, రామకృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పి, బగ్గాం దొరవలస గ్రామ సచివాలయాలను గురువారం ఇఒపిఆర్‌డి కెకె వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మఒడి, ఇకెవైసిని పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. పారిశుధ్య పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు అల్లు తిరుపతి నాయుడు, అధికార నారాయణరావు, పంచాయితీ కార్యదర్శులు శ్రీనివాసరావు, సిహెచ్.మోహనరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పాలకొండ

ఎపి ఎన్జీవో రాష్ట్ర కౌన్సిల్ మహాసభ గోడ పత్రికను పాలకొండ తాలూకా యూనిట్ తరుపున గురువారం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతిచే ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాలకొండ ఎపిఎన్‌జిఒ పాలకొండ తాలూకా యూనిట్ గౌరవాధ్యక్షులు ఎద్దు లిల్లీపుష్పనాథం, అధ్యక్షులు కె.రంగచారి, కార్యదర్శి పి. ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు, సహ ఉపాధ్యక్షులు జె.రమేష్, జి.నాయుడు, బి.అనుష పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

ఎరుకులకు ఎస్‌టి సర్టిఫికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం తురకనాయుడువలసలో నివాసముంటున్న ఎరుకల కులస్తులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోరంగి సీతారాం మాట్లాడుతూ తురకనాయుడువలసలో ఎరుకల కులస్తులకు అనేక ఏళ్ల నుండి ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం ఇస్తున్నప్పటికీ తురకనాయుడువలస గ్రామ రెవెన్యూ అధికారి గ్రామ పెద్దలు ఇవ్వొద్దన్నారని అందుకే ఇవ్వడం లేదని బాధ్యతారహితంగా చెబుతున్నారని అన్నారు. ఎరుకల కులస్తులకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రం మంజూరు చేయకపోవడం వల్ల వారి పిల్లలు సుమారు 30మంది ఐదో తరగతి వరకు చదివి మధ్యలోనే చదువులు నిలిపివేసే పరిస్థితి ఉందన్నారు. వారి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారనున్నది కాబట్టి వెంటనే తహశీల్దార్ చొరవచేసి తురకనాయుడువలసలో గల ఎరుకల కులస్తుల సర్టిఫికెట్లు విచారణ చేసి వారికి ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని లేకపోతే భవిష్యత్తులో వీరందరినీ పార్వతీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆదివాసీ గిరిజన సంఘం సభ్యులు



ఎరువులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మహేష్

రైతులకు ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని రావుపల్లి సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్) అన్నారు. మండలంలోని రావుపల్లి ఆర్‌బికె ద్వారా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి గురువారం రైతులకు అవసరమైన ఎరువులను సర్పంచ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తిస్థాయిలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతు పక్షపాతి అని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కుసిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన అందించాలి

ప్రజాశక్తి- బలిజిపేట

కస్తూరిబా గాంధీ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినిలకు నాణ్యమైన విద్యను అందించేందుకు మహిళా ఉపాధ్యాయ సిబ్బంది కృషి చేయాలని ఎంఇఒ సామల సింహాచలం అన్నారు. గురువారం వంతరాం కెజిబివిని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా తరగతుల్లో బోధనను పరిశీలించి, విద్యార్థినిలకు ఇప్పటివరకు అయిన సిలబస్ పై ప్రశ్నించారు. ఎఫ్‌ఎ 1 ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ గూర్చి ఆరా తీశారు. ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల వివరాలు సబ్జెక్టు టీచర్స్ వివరాలు ఎస్వో మధురవాణిని అడిగి తెలుసుకున్నారు. ఇంటర్ కంప్యూటర్ కోర్సు విద్యార్థినిలకు బోధకులు లేని విషయాన్ని గుర్తించి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, కంప్యూటర్ సబ్జెక్టు టీచర్స్ నియామకాలకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం, నాడు నేడు అదనపు తరగతి గది నిర్మాణ పనులను టాయిలెట్ల మరమ్మత్తు తదితర పనులు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన ఆహార పదార్థాలు రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినిల క్రమశిక్షణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఓని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

డిడి శ్రీనివాస్‌కు పితృవియోగం

ప్రజాశక్తి - బెలగాం

గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ (ఎఫ్‌ఎసి) కె.శ్రీనివాసరావు తండ్రి కె.రామన్న దొర (90) వృద్ధాప్యంతో గరుగుబిల్లి మండలం నాగూరులోని తన స్వగ్రామంలో మృతి చెందారు. ఐటిడిఎ గిరిజన సంక్షేమ సూపరింటెండెంట్, సిబ్బంది, డిప్యూటీ వార్డెన్లు, ఉపాధ్యాయులు, డిడి శ్రీనివాసు స్వగృహానికి వెళ్లి రామన్నదొర పార్థివదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.